సాక్షి వికారాబాద్

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



దరఖాస్తులు 'ఓపెన్'

మధ్యలో ఆపేసిన చదువును మళ్లీ కొన సాగించేందుకు ఓపెన్ స్కూల్ వరంలా ఉపయోగపడుతోంది. 8లో ▸



రాష్ట్రంలో కాంగ్రెస్ జోష్

కార్యకర్తలంతా పార్టీ గెలుపుకోసం కలిసి కట్టుగా పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. 8లో ▸



ఆధ్యాత్మికతతో ఏకాగ్రత

చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక భావనను పెంపొందించాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధి హరినాథ్ అన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

15 నుంచి నిరవధిక సమ్మె



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

అనంతగిరి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15 నుంచి నిరువధిక సమ్మెకు దిగనున్నట్లు ఏఎన్ఎంలు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఏఎన్ఎం యూనియన్ నాయకులు పాపమ్మ, విజయ, జ్యోతి, పద్మ, నరసమ్మ, నిహారిక, మంగమ్మ, విజయ, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యంషాపులకు 26 దరఖాస్తులు

అనంతగిరి: జిల్లాలో 59 మద్యంషాపుల ఏర్పాటుకు గాను సోమవారం 26 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్ర తెలిపారు. వీటిలో వికారాబాద్–3, పరిగి–13, మోమిన్‌పేట–6, కొడంగల్–4 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. తాండూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని తెలిపారు.

'చేనేత' సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



హన్మంతు, పండరి దంపతులను సన్మానిస్తున్న అక్బర్‌బాబా

యాలాల: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా అన్నారు. 'చేనేత కార్మికుల దినోత్సవం' సందర్భంగా సోమవారం ఆయన యాలాల మండలం గోవిందరావుపేటకి చెందిన చెందిన చేనేత కార్మికుడు హన్మంతు, పండరి దంపతులను సన్మానించారు. చేనేత కార్మికులకు బీఆర్ఎస్ సర్కార్ రూ.3వేల పింఛన్ అందజేస్తుందన్నారు. అంతేకాకుండా వారి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేస్తోందన్నారు. దళితబంధు తరహాలో చేనేత కుటుంబాలకు రూ.10లక్షల ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని పలువురు చేనేత కార్మికులు ఆయనకు విన్నవించారు. బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు, మౌలాన, యువరాజు, బుగ్గప్ప, వెంకటేష్,నవీన్ తదితరులు ఉన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: కష్టపడితే ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం వికారాబాద్ జిల్లా క్రీడా యువజన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువ ఉత్సవ్ ఉత్సవ్–2023 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఎంపీపీ చంద్రకళ, ఎంపీడీఓ సత్తయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యాలాలలో మరో నాలుగు జీపీలు

యాలాల: మండలంలో కొత్తగా మరో నాలుగు అనుబంధ గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయాలంటూ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రభుత్వానికి నివేదించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల్లోగా కొత్త పంచాయతీల ఏర్పాటుపై ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. మండలంలోని బాగాయిపల్లి, దేవులతండా, పేర్కంపల్లితండా, మల్‌రెడ్డిపల్లి గ్రామాలు కొత్త జీపీలుగా మారనున్నాయి. ఇప్పటికే 37 పంచాయతీలు ఉన్న మండలంలో మరో నాలుగు జీపీలు ఏర్పాటయితే మొత్తం జీపీల సంఖ్య 41కు పెరిగే అవకాశం ఉంది. చిన్న పంచాయతీల ఏర్పాటుతో గ్రామాల్లో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారం ఉంటుందని రవీందర్‌రెడ్డి తెలిపారు. కొత్త జీపీల ఏర్పాటుపై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.

ఎస్..ఐ

ఎస్ఐ తుది ఫలితాల్లో జిల్లా అభ్యర్థులు సత్తాచాటారు. ఏడు కొలువులతో కుల్కచర్ల మండలం జిల్లాలోనే టాప్ ప్లేస్‌లో నిలిచింది. కొందరు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఎస్ఐ పోస్టు సాధించగా మరికొందరు తొలి ప్రయత్నంలో కలను సాకారం చేసుకున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం

ఎస్ఐ ఫలితాల్లో సత్తాచాటిన జిల్లా అభ్యర్థులు

- ఏడు కొలువులతో జిల్లాలో టాప్ ప్లేస్‌లో నిలిచిన కుల్కచర్ల మండలం
- విజేతలను ఘనంగా సన్మానించిన నేతలు, శ్రేయోభిలాషులు



వికారాబాద్ అర్బన్: ఎస్ఐ ఉద్యోగం సాధించిన యతీష్ చంద్రను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్



సుజీత్, మోమిన్‌పేట



మీనాక్షి, మోమిన్‌పేట



యాదయ్య, కుల్కచర్ల



అశోక్, పాతకొడంగల్



గోపాల్, పుట్టపహాడ్



మహేందర్‌రెడ్డి, టేకుల్ కోడ్



జ్ఞానేశ్వర్, ఇప్పాయిపల్లి



చంద్రకాంత్, బొంరెడ్డిపల్లి



సంజీవ్, మక్తవెంకటాపూర్



జరీనాబేగం, మక్తవెంకటాపూర్



అనూష, అడవివెంకటాపూర్



రాఘవేందర్ రెడ్డి, బొంరెడ్డిపల్లి



రాహుల్, గాలిగూడెం



రాఘవేందర్‌రెడ్డి, బూచన్‌పల్లి



హిమబిందు, పులుసుమామిడి

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన బొండాల యతీష్ చంద్ర సిద్దులూరు పోస్టాఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగం చేస్తూనే ఎస్ఐ పరీక్ష రాసి మొదటి ప్రయత్నంలోనే ఎస్ఐగా ఎంపికయ్యారు. అలాగే పులుసుమామిడికి చెందిన హిమబిందు తొలి ప్రయత్నంలోనే ఎస్ఐ ఉద్యోగం సాధించారు. తండ్రి, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే కొలువు సాధించానని తెలిపారు.

ఒక్కో దశ దాటుతూ..

దౌల్తాబాద్: మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్వేత, రక్షితారెడ్డి చిన్ననాటి నుంచి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే పట్టుదలతో సన్నద్ధమయ్యారు. ఎస్ఐ పరీక్షలకు సంబంధించి ఒక్కో దశ దాటుకుంటూ గమ్యాన్ని చేరుకున్నారు. తుది ఫలితాల్లో మండలం నుంచి ఇద్దరూ ఎస్‌గా ఉద్యోగం సాధించారు.

కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా..

మోమిన్‌పేట: మండల పరిధిలోని అంరాధికలాన్ గ్రామానికి చెందిన మీనాక్షి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుజీత్ ఇద్దరు ఎస్ఐ ఉద్యోగాలకు ఏంపికయ్యారు. మీనాక్షి ఎంబీఏ పూర్తి చేయగా, సుజీత్.. ఆరు సంవత్సరాల క్రితం కానిస్టేబుల్‌గా ఏంపికై విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఎస్ఐ తుది ఫలితాల్లో ఇరువురూ ఎంపికయ్యారు.

ఆర్మీ జవాన్‌గా రిటైరై..

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని టేకుల్‌కోడ్‌కు చెందిన మహేందర్‌రెడ్డి, పాతకొడంగల్‌కు చెందిన అశోక్ ఎస్ఐ ఉద్యోగాలు సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహేందర్‌రెడ్డి ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహించి రిటైర్ అయ్యారు. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన ఎస్ఐ సెలక్షన్స్‌లో పాల్గొని కొలువు సాధించారు.పాతకొడంగల్ గ్రామానికి చెందిన అశోక్ ఎస్ఐ పరీక్షా ఫలితాల్లో విజయం సాధించి తన కలను సాకారం చేసుకున్నాడు.

ఏడు కొలువులతో ప్రభంజనం..

కుల్కచర్ల: కుల్చచర్ల మండలానికి చెందిన 7మంది అభ్యర్థులు ఎస్ఐ ఉద్యోగాలను సాధించారు. అదేవిధంగా కుల్కచర్ల మండలంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఒకరు, ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మరొకరు ఎస్ఐగా ఎంపికయ్యారు.

ఆటో డ్రైవర్‌కా బేటా ఎస్ఐ..

తాండూరు టౌన్: పెద్దేముల్ మండలం రుక్మాపూర్‌కు చెందిన నాగప్ప, లాలమ్మ దంపతుల కుమారుడు అశోక్ ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. తండ్రి నాగప్ప ఆటో డ్రైవర్ కాగా, తల్లి కూలీపని చేస్తుంటుంది. అశోక్ ప్రస్తుతం ఓయూలో పీజీ చదువుతున్నాడు. ఆటో డ్రైవర్‌కా బేటా ఎస్ఐ అని స్థానికులు అంటుంటే ఆనందంగా ఉంది.

కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే..

తాండూరు మండలం కరన్‌కోట్ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీకాంత్‌రెడ్డి ఎస్ఐ కొలువు సాధించాడు.సీఐ రాంబాబు, ఎస్ఐ మధుసూధన్ రెడ్డి, సహచర కానిస్టేబుళ్లు లక్ష్మీకాంత్‌రెడ్డిని సోమవారంసత్కరించారు. కాగా లక్ష్మీకాంత్‌రెడ్డి స్వగ్రామం కోట్‌పల్లి మండలం బార్వాద్ గ్రామం.

తల్లి కష్టానికి తగిన ఫలితం..

మర్పల్లి: మండల పరిధిలోని వీర్లపల్లికి చెందిన వెంకట్‌రెడ్డి సుగణమ్మ రెండో కుమారుడు శశివర్ధన్‌రెడ్డి 2020లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు.ప్రస్తుతం జీడిమెట్ల పీఎస్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తాజాగా విడుదలైన ఫలితాల్లో ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. అలాగే మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామానికి చెందిన మంగమ్మ (ఒంటరి మహిళ) రెక్కల కష్టంతో ఇద్దరు కుమారులను చదివించింది. పెద్దకుమారుడు రాఘవేందర్‌రెడ్డి..2020 ఏడాదిలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యో గం సాధించాడు. శంకర్‌పల్లి పీఎస్‌లో విధు లు నిర్వర్తిస్తూనే ఎస్ఐ పరీక్షలు రాసి లక్ష్యాన్ని చేరుకున్నాడు.

దోమ మండలం నుంచి..

దోమ: ఎస్ఐ ఫలితాల్లో దోమ మండలానికి చెందిన రవీందర్, శ్రీనివాస్, దాదాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ ఎస్ఐ ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని స్థానికులు సోమవారం ఘనంగా సన్మానించారు.

బందెయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన కిష్టమ్మ, కిష్టయ్య కుమారుడు.. బందెయ్య టీఎస్ఎస్‌పీ (రిజర్వ్) ఎస్ఐగా ఎంపిక కావడంతో సోమవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శేరినారాయణరెడ్డి అతడిని ఘనంగా సన్మానించారు. యువత బందెయ్యను స్ఫూర్తిగా తీసుకుని అనుకున్న లక్ష్యం సాధించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు బందెయ్యను అభినందించారు

కూలీపని చేసి చదివించారు



మాది దౌల్తాబాద్ మండలంలోని బాలంపేట గ్రామం. నేను వెంకటయ్యగౌడ్, మంగమ్మ దంపతుల రెండవ కూతుర్ని. తల్లిదండ్రులు కూలీపని చేసి నన్ను చదివించారు. వారి కష్టాన్ని చూస్తూ పెరిగాను. మహబూబ్‌నగర్‌లో ఇంటర్, డిగ్రీ పూర్తిచేసి ప్రస్తుతం పీజీ చదువుతున్నాను. ఓ వైపు పీజీ చేస్తూనే పోటీ పరీక్షలపై దృష్టి సారించాను. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఐగా ఎంపికయ్యాను.

– శ్వేత, బాలంపేట, దౌల్తాబాద్

మొదటి ప్రయత్నంలోనే..



మాది దౌల్తాబాద్ మండలంలోని అంతారంగ్రామం .సివిల్ ఎస్ఐగా ఎంపికయ్యాను. భీంరెడ్డి, సావిత్రమ్మల దంపతుల కూతుర్ని. మాది వ్యవసాయ కుటుంబం. పీజీ పూర్తి చేసిన అనంతరం సివిల్స్‌కు సిద్ధం అవుతూనే ఎస్ఐ పరీక్షలు రాశాను. మొదటి ప్రయత్నంలోనే సివిల్ ఎస్ఐగా ఎంపికయ్యాను.

– రక్షితారెడ్డి, అంతారం, దౌల్తాబాద్

కానిస్టేబుల్ నుంచి..



మా స్వగ్రామం ధారూరు మండల పరిధిలోని కొండాపూర్‌ఖుర్దు. ప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాను. మొదటిసారి రాసిన ఎస్ఐ పరీక్షల్లో విజయం దక్కలేదు. రెండోసారి పట్టుదలతో ప్రయత్నించి అనుకున్న కొలువు సాధించాను.

– శివకుమార్‌రెడ్డి, కొండాపూర్‌ఖుర్దు, ధారూరు

వ్యవసాయం చేస్తూనే..



పేద కుటుంబంలో పుట్టిన నేను పోలీసు ఉద్యోగం మీద ఉన్న మక్కువతో కష్టపడి చదివాను. నా కష్టానికి తోడు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిది. ఒకవైపు వ్యవసాయం చేస్తూనే ఎస్ఐ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను. ఎస్ఐ ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది.

– శ్రీనివాసులు, దోమ

యూనిఫాం అంటే ఇష్టం



మాది దోమ మండలం దాదాపూర్ గ్రామం. చిన్నప్పటి నుంచే పోలీస్ యూనిఫాం అంటే ఎంతో ఇష్టం. కఠోర శ్రమంతో పోలీస్ ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యాను. ప్రిలిమ్స్ మొదలు అన్ని దశలు క్లియర్ చేసుకుని ఎస్ఐగా ఉద్యోగం సాధించాను. కుటుంబ సభ్యులు కూడా చాలా సంతోష పడుతున్నారు.

– సంతోష్, దాదాపూర్, దోమ

కోచింగ్‌తో పట్టు సాధించా



కుల్కచర్ల మండల పరిధిలోని బొంరెడ్డిపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. ఎస్ఐ నోటిఫికేషన్ రాగానే కోచింగ్‌కు వెళ్లి బాగా ప్రిపేర్ అయ్యాను. అన్ని దశలు దాటి విజయం సాధించాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మాటల్లో చెప్పలేను.

– రాఘవేందర్, బొంరెడ్డిపల్లి, దోమ

పథకాల అమలులో వేగం పెంచండి



సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారులు

- అధికారులతో కలెక్టర్ నారాయణ రెడ్డి సమీక్ష
- ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశం

వికారాబాద్ అర్బన్: నిర్దేశించిన మేరకు ప్రభుత్వ పథకాల అమలును వేగవంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి సీఎస్ ఆదేశాలను వారికి వివరించారు. హరితహారం, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59, నోటిపై భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనార్టీలకు లక్ష ఆర్థికసహాయం, గొర్రెల పంపిణీ, దళిత బంధు వంటి పథకాలను లక్ష్యం మేరకు అమలు చేయాలన్నారు. ప్రతివారం జిల్లాలో 100 గొర్రెల యూనిట్ల గ్రౌడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ కులవృత్తులకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయానికి సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 300 చొప్పున ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఆగస్టు 10లోపు చెక్కుల పంపిణీ పూర్తిచేయాలన్నారు. గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులు స్వీకరించేందుకు తహసిల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆగస్టు 10వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.

సమన్వయంతో పనిచేయండి..

రెండో దశలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 1100 మంది లబ్ధిదారులకు దళితబంధు పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో దళితబంధు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 59 కింద క్రమబద్ధీకరణ కోసం ఎంపికైన లబ్ధిదారుల నుంచి రుసుము వసూళ్లను త్వరగా పూర్తిచేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో వ్యవసాయేతర నోటరీ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతించిందని కలెక్టర్ తెలిపారు. ఆన్‌లైన్, మీసేవా ద్వారా వీటికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

వేడుకలకు ఘనంగా నిర్వహించాలి..

కలెక్టరేట్ ఆవరణలో ఈనెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారంకలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులకు, ప్రజలకు అన్నిసౌకర్యాలు కల్పించాలన్నారు. అన్ని సంక్షేమ అధికారులు.. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై స్టాల్స్, ట్యాబ్లూస్‌లను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్ పాటిస్తూ అతిథులకు గ్యాలరీలు కేటాయించాలన్నారు. ఏర్పాట్లలో నిర్లక్ష్యానికి తావు ఇవ్వద్దన్నారు. అయితే గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారుల దరఖాస్తులను సోమవారం నుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బీజేపీని గెలిపిస్తే రాష్ట్రం మరో మణిపూర్



పరిగిలో బంద్ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు

- భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌నాయక్
- యూనిఫాం సివిల్ కోడ్‌కు వ్యతిరేకంగా పరిగిలో నిరసన

పరిగి: తెలంగాణలో బీజేపీని గెలిపిస్తే మరో మణిపూర్ అవుతుందని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి, గిరిజన విద్యార్థి సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. మణిపూర్ ఘటనతో పాటు యూనిఫాం సివిల్ కోడ్‌ను వ్యతిరేకిస్తూ పరిగి పట్టణంలో సోమవారం ప్రజాసంఘాల నేతలతో కలసి భారత్ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. కేంద్రం యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలులోకి తెచ్చి రాజ్యాంగం ఇచ్చిన ఎస్టీ గుర్తింపును రద్దుచేసి వారిని హిందువులుగా మార్చే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఆదివాసీయుల సంప్రదాయాలు, వారికి కల్పించిన హక్కులు, అధికారాలను రద్దు చేసే కుట్ర జరుగుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రజలు రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని బొందపెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ దోమ మండల అధ్యక్షుడు రవీందర్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం పరిగి మండల అధ్యక్షుడు అనిల్‌నాయక్, ఎంపీ ఫౌండేషన్ రాములు, భారత్ ముక్తి మోర్చా నాయకులు రఫీ, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు అంబర్‌సింగ్ నాయక్, అరుణ్ నాయక్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీకాల పంపిణీకి 'మిషన్ ఇంద్ర ధనస్సు'

మొయినాబాద్: మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఇందులో భాగంగా సోమవారం పెద్దమంగళారం సబ్ సెంటర్‌లో చిన్నారులకు నెలవారీ టీకాలు వేశారు. సబ్ సెంటర్‌ను సందర్శించిన ఆయన మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని పరిశీలించారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు టీకాలు ఎలా ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు టీకాలు వేయించని పసిపిల్లలను గుర్తించి ఈ నెల 7నుంచి 12 వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14 వరకు ప్రత్యేక కార్యక్రమం ద్వారా వేయాలని సిబ్బందిని ఆదేశించారు.వ్యాక్సినేషన్ జిల్లా అధికారి స్వర్ణకుమారి, చేవెళ్ల డివిజన్ వైద్యాధికారి దామోదర్, మండల వైద్యాధికారి వాణి, సూపర్‌వైజర్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

ఉత్కర్ష్'లో ఒగ్గుకళ

బొంరాస్‌పేట: జాతీయ స్థాయి ఉత్సవాల్లో మండల పరిధిలోని నాందార్‌పూర్‌కు చెందిన చండీశ్వర ఒగ్గుకళా సమితి కళాకారులు ప్రతిభ కనబర్చారు. భోపాల్‌లో ఈనెల 1నుంచి కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్కర్ష్ కళాప్రదర్శనల్లో నాందాపూర్‌కు చెందిన ఒగ్గుబీరు కళాబృందం సభ్యులు ప్రదర్శన ఇచ్చారు. అందులో ప్రతిభ కనబర్చిన తమకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రశంసా పత్రం అందించారని వారు తెలిపారు. మన రాష్ట్ర కళలను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు సహకరించిన, ప్రోత్సహించిన రాష్ట్ర సాంస్కృతి కశాఖ అధ్యక్షుడు మామిడి హరికృష్ణ, ఒగ్గుకళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికి ఈ సందర్భంగా కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు.



భోపాల్‌లో నిర్వహించిన ఉత్కర్ష్ ఉత్సవాల్లో ఒగ్గుకళాకారుల ప్రదర్శన

క్లుప్తంగా

షాపింగ్ మాల్‌లో చోరీ

కొడంగల్: పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరపడ్డారు. వివరాల ప్రకారం.. కుమ్మరి కాశప్ప, కుమ్మరి బుగ్గప్ప భాగస్వామ్యంలో శాలివాహన షాపింగ్ మాల్ పెట్టారు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి దుకాణం బంద్‌చేసి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా షెటర్ ధ్వసం చేసి ఉంది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి

టీయూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాల్

అనంతగిరి: ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీయూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం టీయూటీఎఫ్ 13వ వార్షికోత్సవం సందర్భంగా వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. సంఘం జెండా ఆవిష్కరణ అంతతరరం గోపాల్ మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. 30శాతం తగ్గకుండా ఐఆర్ ప్రకటించి పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ డీఏలను రిలీజ్ చేయానల్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవ్యానాయక్, రాష్ట్ర కార్యదర్శి జాంప్ల, నర్సింలు, భావన ఋషి, సంతోష్ కుమార్, బాలకృష్ణ, బసవరాజ్, భాస్కర్, అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగం తీసిన ప్రాణం

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- సీఆర్‌పీఎఫ్ రిటైర్డ్ కానిస్టేబుల్ మృతి


కిష్టయ్య(ఫైల్)

అనంతగిరి: అతివేగం ఓ సీఆర్‌పీఎఫ్ రిటైర్డ్ కానిస్టేబుల్ ప్రాణాలను తీసుకుంది. ఈ ఘటన వికారాబాద్ పీఎస్ పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ శ్రీను తెలిపిన ప్రకారం.. నవాబ్‌పేట్ మండలం నారెగూడెంకు చెందిన సీఆర్‌పీఎఫ్ రిటైర్డ్ కానిస్టేబుల్ బేగరి కిష్టయ్య(51) వికారాబాద్‌లో అద్దెకు ఉంటున్నాడు. రోజుమాదిరిగానే తన కూతురిని పట్టణంలోని ఎన్నెపల్లిలో బస్సు ఎక్కించి ఇంటికి వస్తున్నాడు. ఎదురుగా అతివేగంగా వస్తున్న డీసీఎం చెన్నారెడ్డి విగ్రహం వద్ద ఎదురుగా వస్తున్న కానిస్టేబుల్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కిష్టయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆయన్ను వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన తుది శ్వాస విడిచాడు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాల విక్రయం

తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ జుబేర్

షాద్‌నగర్‌రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా అన్ని తపాలాశాఖ కార్యాలయాలలో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ ఎంఏ.జుబేర్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని తపాలాశాఖ కార్యాలయంలో ఈ విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ.. 20 నుంచి 30 అంగుళాల జాతీయ జెండాను రూ.25 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 12 వరకు ఆన్‌లైన్‌లో అమ్మకాలు చేపడుతున్నామన్నారు. ఎక్కువ మొత్తంలో అవసరం ఉన్న వారు తపాలాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, సబ్ పోస్టుమాస్టర్ విజయ్‌కుమార్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు 'ఓపెన్'

- దూరవిద్యా విధానంలో టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్
- బడి మానేసిన, చదువుకోలేని వారికి సువర్ణావకాశం
- ఈ నెల 10వరకు దరఖాస్తుల స్వీకరణ


ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరైన విద్యార్థులు(ఫైల్)

కొడంగల్ రూరల్: చదువుతోనే గౌరవం.. బంగారు భవిత. మధ్యలో ఆపేసిన చదువును మళ్లీ కొనసాగిద్దాం, సమాజంలో మనకూ గుర్తింపు లభించాలి అనే సంకల్పం కలిగిన వారికి ఓపెన్ స్కూల్ వరంలా ఉపయోగపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సార్వత్రిక విద్య (టాస్) ఆధ్వర్యంలో దూరవిద్యా విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పని చేసుకుంటూనే సెలవు రోజుల్లో ఓపెన్ పాఠశాలల్లో చదువుకోవచ్చు. దీంతో వృత్తి పనులు చేసుకునేవారు, ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందాలనుకునేవారు ఓపెన్ స్కూల్ విద్య వైపు చూస్తున్నారు. ఇక్కడ చదువు పూర్తి చేసుకుంటే రెగ్యులర్‌కు సమానంగా సర్టిఫికెట్ ప్రాధాన్యం ఉండడంతో ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు.

దరఖాస్తు విధానం

పదో తరగతి చదివేందుకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. 14ఏళ్లు నిండిన ఆపై వయస్సు కలిగినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తహసీల్దార్ లేదా, మున్సిపల్ అధికారులు జారీ చేసిన వయస్సు ధృవీకరణ ప్రతం ఉండాలి. మధ్యలో బడి మానేస్తే అప్పటి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ), ఆధార్‌కార్డుతో ప్రవేశం పొందవచ్చు. పదో తరగతి, ఇంటర్మీడియట్ 2023–24విద్యా సంవత్సరంలో చేరే అభ్యాసకులు ఆగస్టు 10 వరకు ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కేంద్రం నిర్వాహకులు పేర్కొంటున్నారు. అభ్యాసకులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి రసీదును సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తుతో సమర్పించాల్సి ఉంటుంది.

సమాన గుర్తింపు..

ఓపెన్ టెన్త్, ఇంటర్ పూర్తి చేసుకున్న వారికి రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు ఉంటుంది. ఉన్నత విద్య, పదోన్నతులు, ఉద్యోగాలు పొందడానికి, చదువు మధ్యలో మానేసినవారికి, గృహిణులకు, వయోజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చదువుకోవాలనే ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఓపెన్ కేంద్రాల్లో చేరుతూ సద్వినియోగం చేసుకోవాలని కేంద్రాల కో ఆర్డినేటర్లు కోరుతున్నారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం, సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు బోధిస్తారు.

కనీస ఫీజుతో ప్రవేశాలు



ఓపెన్ టెన్త్, ఇంటర్ స్కూల్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర కొడంగల్‌లో నిర్వహిస్తున్నాం. గతేడాది 2022–23విద్యా సంవత్సరంలో టెన్త్‌లో 30మంది విద్యార్థులు, ఇంటర్‌లో 75మంది విద్యార్థులు ఓపెన్ స్కూల్‌లో చేరారు. ఓపెన్ స్కూల్ చేరేందుకు ఈ నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు కనీస ఫీజుతోనే అవకాశం కల్పిస్తుంది.

– గోపీనాథ్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్, ఓపెన్ స్కూల్ కొడంగల్

రాష్ట్రంలో కాంగ్రెస్ జోష్


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్ రెడ్డి

- కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలి
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: రాష్ట్రమంతా కాంగ్రెష్ జోష్ ఉందని.. కార్యకర్తలంతా పార్టీ గెలుపుకోసం కలిసికట్టుగా పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ బూత్ కో ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉన్నందున అధికార పార్టీ నేతలు సైతం హస్తం గూటికి చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ సాధించిన గెలుపు వ్యూహమే మన రాష్ట్రంలో అమలు చేస్తుండడంతో నాయకులు, కార్యకర్తలు మరింత శ్రద్ధతో పని చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పలు సంస్థలు నిర్వహించిన సర్వేలతో పాటుగా అధికార పార్టీ సర్వేలోనూ పరిగి నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలవడం ఖాయమే ప్రచారం జోరుగా సాగుతోందన్నారు. బూత్ కోఆర్డినేటర్స్ ఎన్నికల ప్రక్రియను తెలుసుకోవడంతో పాటుగా క్షేత్రస్థాయిలో సైతం ఓటు వేసే విధానాల గురించి వివరించాలన్నారు. అనంతరం గద్దర్ మృతికి సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, పార్టీ ప్రధాన కార్యదర్శులు యాదయ్య, సత్యనారయణ, కుల్కచర్ల ఎంపీటీసీ సభ్యుడు ఆనందం, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాంచందర్, బీసీ సెల్ అధ్యక్షుడు మహేశ్, మండల ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, పార్టీ మీడియా కోఆర్డినేటర్స్ భాస్కర్, భరత్ కుమార్ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తిస్తే ఉత్తమ ఫలితాలు


రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మండల పరిషత్ అధికారులు

ఎంపీడీఓ నాగవేణి

కుల్కచర్ల: తమలోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగునంగా కష్టపడితే ఉత్తమ ఫలితాతలు సాధించవచ్చునని ఎంపీడీఓ నాగవేణి అన్నారు. ఆదివారం టీఎస్ఎల్‌పీఆర్‌బీ విడుదల చేసిన తుది ఫలితాలత్లో మండల పరిధిలోని బొంరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కాగా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో రాఘవేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రవి, రఘు, విజయభాస్కర్, మహేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, రాజు, అనూష, శైలజ, శారధద, మైమూనబేగం, రాధ, ఎల్లమ్మ, సూపరింటెండెంట్ రమేశ్, జూనియర్ అసిస్టెంట్ వెంకటయ్య, కంప్యూటర్ ఆపరేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో బంజారా భవన్


మంత్రి సబితారెడ్డిని కలిసిన గిరిజనులు

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: గిరిజనుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మున్సిపాలిటీకి చెందిన గిరిజనులు సోమవారం నగరంలోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బంజారుల వినతి మేరకు మున్సిపల్ కేంద్రంలో రూ.50 లక్షల నిధులతో బంజారా భవనం నిర్మిస్తామన్ని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజనులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవినాయక్, పార్టీ నాయకులు శ్రీనివాస్, సురేశ్, యాదగిరి, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, శ్యామేల్ రాజు, రవీందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కంట్లో కారం చల్లి పుస్తెలతాడు చోరీ

కేశంపేట: మహిళ కంట్లో కారం చల్లి గుర్తు తెలియని దుండగుడు బంగారు పుస్తెలతాడును లాక్కెల్లాడు. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాల శివారులోని తులవానిగడ్డలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన జువ్వ శ్రీలత భర్త శ్రీనివాసులుతో కలిసి పొలానికి వెళ్లారు. శ్రీలత వ్యసాయపనుల్లో ఉండగా భర్త కొద్దిదూరంలో ఆవును మేపుతున్నాడు. సాయంత్రం ఎక్లాస్‌ఖాన్‌పేట నుంచి కొత్తపేట వైపునకు బైక్‌పై ప్రయాణిస్తున్న దుండగుడు ఆమె వద్దకు వచ్చి సెల్‌ఫోన్‌లో ఓ వ్యక్తిని చూపుతూ.. తనను గుర్తుపడతావా అంటూ వెంట తెచ్చుకున్న కారం పొడిని మహిళ కంట్లో చల్లాడు. మహిళను వంచి మెడలోంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. బాధితు రాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు వచ్చిన మార్గంలోనే తిరిగివెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్ రూరల్ సీఐ లక్ష్మీరెడ్డి, ఎస్ఐ వరప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బిల్లులు తేడా .. ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు

శంషాబాద్: గగన్‌పహాడ్‌లోని ఓ మాల్‌లో స్థానికంగా ఉండే కిరణ్ అనే వ్యక్తి వస్తువులు కొనుగోలు చేశాడు. ఇంటి వద్దకు వెళ్లాక బిల్లు చెక్ చేస్తే వందల రూపాయలు తేడా రావడంతో మాల్ వద్దకు వెళ్లి ఆందోళన చేశాడు. దీంతో నిర్వాహకులు బిల్లు వేసే వ్యక్తి తప్పిదంగా సర్దిచెప్పారు. తదనంతరం మరోసారి బిల్లు వేసే సందర్భంలో కూడా తప్పుగా రావడంతో బాధితుడు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అక్కడి చేరుకుని మెట్రో నిర్వాహకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.సాంకేతిక పొరపాటు వల్ల బిల్లులు తేడా వచ్చాయని నిర్వాహకులు వెల్లడించారు. దీనిపై దర్యాప్తు చేయాలని బాధితుడు పోలీసులను కోరాడు.

గాంధీజీ విగ్రహాన్ని ఢీకొట్టిన టిప్పర్

తెల్లవారుజామున పెద్ద శబ్దం రావడంతో ఆందోళన చెందిన గ్రామస్తులు


అమ్డాపూర్ చౌరస్తాలో టిప్పర్ వాహనం ఢీకొట్టడంతో ధ్వంసమైన గాంధీజీ విగ్రహం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్‌లో ఓ టిప్పర్ లారీ గాంధీజీ విగ్రహాన్ని ఢీకొట్టింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో పెద్దశబ్దం వినిపించింది. దీంతో ఆందోళన చెందిన గ్రామస్తులు లేచి చూడగా గ్రామంలోని చౌరస్తాలో ఉన్న గాంధీ విగ్రహాన్ని ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో దిమ్మె, విగ్రహం ధ్వంసమయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం సంభవించిందని గ్రామస్తులు పేర్కొన్నారు. నిత్యం అప్పా జంక్షన్ నుంచి జేబీఐటీ అమ్డాపూర్ మీదుగా శంషాబాద్ మండలం మల్కారం వైపు రాత్రిళ్లు టిప్పర్ లారీలు భారీ వెళ్తున్నాయని.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నామన్నారు. విగ్రహం ఏర్పాటు చేయాలని లారీ యజమానికి సూచించారు. ఇందుకు ఆయన ఒప్పుకోవడంతో సమస్య సద్దుమనిగింది.

బెల్టుతో ఉరేసుకుని కార్మికుడి బలవన్మరణం


కేదార్ బిషి మృతదేహం

చేవెళ్ల: ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసే కార్మికుడు బెల్ట్‌తో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పవన్ రూటో ప్రింట్ ఇండస్ట్రీస్‌లో రెండేళ్లుగా ఒడిస్సాకు చెందిన ఐదుగురు కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో కేదార్ బిషి(22)అనే కార్మికుడు ఆరు నెలల కిత్రం పనికి వచ్చాడు. ఆదివారం రాత్రి డ్యూటీకి వెళ్లకుండా మద్యం సేవించి గదిలోనే ఉన్నాడు. సోమవారం ఉదయం 9గంటలకు వచ్చిన తోటి కార్మికులు గదిలో కేదార్ బిషి లేకపోవటంతో చుట్టు పక్కల వెతికారు. అప్పటికే స్థానికులు మండలకేంద్రంలోని సాయి వైన్స్ సమీపంలో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుచెప్పటంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతడు తమతోపాటు పనిచేసే కార్మికుడేనని గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తరుచూ ఫోన్ మాట్లాడేవాడని.. ఒంటరిగా ఉండేవాడని తోటి కార్మికులు చెప్పారు. కంపెనీ మేనేజర్ ఆకుల శేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లొకేషన్ షేర్ చేసి చెరువులో దూకిన యువకుడి మృతి


వాసు మృతదేహం

ఇబ్రహీంపట్నం: లొకేషన్ షేర్ చేసి ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ, ఎస్ఐ మారయ్య తెలిపిన ప్రకారం.. నగర శివారులోని హస్తినాపురం డివిజన్‌కు చెందిన నేనావత్ వాసు(20) డిప్లొమా చదివాడు. ఉన్నత చదువులకు ఆసక్తిలేక.. ఎవరికీ చెప్పుకోలేక మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం రాత్రి 9.30గంటల ప్రాంతంలో స్నేహితుడి వద్దకు వెళ్తున్నానంటూ ఇంటి నుంచి బయలుదేరాడు. అదేరోజు రాత్రి ఆత్మహత్య చేసుకుంటున్నానని స్నేహితుడు మహేశ్‌కు వాట్సాప్‌లో లొకేషన్ షేర్ చేశాడు. వెంటనే మహేశ్ పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఇబ్రహీంపట్నం చిన్న చెరువు పరిసరాల్లో వెతికారు. చీకటి పడడంతో సోమవారం ఉదయం గాలింపు చేపట్టగా అతని చెప్పు ఒకటి కనబడింది. వెంటనే చెరువులో గాలించగా వాసు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిరీక్షణకు తెర

'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

దోమ: తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'ఎన్నాళ్లీ నిరీక్షణ!' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జిల్లా స్థాయి అధికారులు డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలనకు వెళ్లిన డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్‌ను కార్యాలయంలోనే ఉండాలంటూ ఆదేశాలు జారీ చేసింది.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్ అండ్ బీ శాఖల డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్


మాట్లాడుతున్న సాధన రష్మి పెరుమాల్

శంకర్‌పల్లి: సైబర్ నేరాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్ సూచించారు. సోమవారం ఆమె మండల పరిధిలోని మోకిల పీఎస్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటారని వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫోన్‌కు వచ్చిన అపరిచిత లింక్‌లను ఓపెన్ చేయొద్దని చెప్పారు. ఓటీపీలను అనుమానితులకు చెప్పొద్దన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. స్కూల్ బస్ నడిపే డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరియన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, మోకిల సీఐ నరేశ్, శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి, డీఐ నాగరాజు, ఎస్ఐ కృష్ణ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమంలో మనమే నంబర్ వన్

కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

తలకొండపల్లి: సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో తన శక్తి మేరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. సోమవారం మండల పరిధిలోని చుక్కాపూర్‌లో, సంఘాయిపల్లితండా, చెన్నారం గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సాలు చేశారు. చుక్కాపూర్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు, సంఘాయిల్లి గేట్ వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చుక్కాపూర్–ఖానాపూర్ వరకు నిర్మించిన బీటీరోడున్ను ప్రారంభించారు. అనంతరం చుక్కాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం చెన్నారం గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణ పనులు, బీటీరోడ్డు నిర్మాణ పనులు, మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా రైతురుణ మాఫీ చేస్తున్నందున సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి మొక్కులు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే 24 గంటల ఉచిత కరెంట్‌ను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. 1.50కోట్ల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు కిష్టమ్మ, స్వప్న, భాస్కర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బుజ్జి, ఎంపీటీసీ సభ్యులు వందన, సరిత, గణేశ్‌గుప్తా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య, ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, వరలక్ష్మి, ఆంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ పట్టాభిరామశర్మ, కృష్ణమూర్తి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు రమేశ్‌నా యక్, శేఖర్, భాస్కర్‌రెడ్డి, గణేశ్, మల్యానాయక్, చంద్రయ్య, రాజేందర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో కడ్తాల్‌కు మహర్దశ

కడ్తాల్: హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న కడ్తాల్ పట్టణం రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందనుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పీఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బటర్‌ఫ్లై సిటీ సంస్థ అందించిన సీఎస్ఆర్ ఫండ్ రూ.1.50 కోట్లతో నిర్మించిన పోలీస్‌స్టేషన్‌ను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల, తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఎంపీడీఓ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు, మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఫార్మాసిటీ, ఫార్మా వర్సిటీలు ఏర్పాటు చేయనుండడంతో ఈ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందనుందన్నారు. మెట్రో రైలు మార్గాన్ని కడ్తాల్ మీదుగా ఆమనగల్లు వరకు పొడగించాలని సీఎం కేసీఆర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించి, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీ ఈడీ రమేశ్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, వెంకటేశ్, ఎంపీడీఓ రామకృష్ణ, డీటీ వినోద్‌కుమార్, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, వినోద్, రమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ తదితరులు ఉన్నారు.